

ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

మెదక్ అర్బన్, జనవరి 25: అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఇసుక, మట్టి రవాణాపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన స్పందించారు. విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని రెవెన్యూ, పోలీస్, మైనింగ్‌శాఖల అధికారులను ఆదేశించారు. అక్రమ రవాణా కట్టడికి డివిజన్లవారీగా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్ సమన్వయ పర్చుకుంటూ అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు.

జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తా

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సభలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జహీరాబాద్, జనవరి 25: జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండాలో ఉన్న మోతీమాత ఆలయాన్ని గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోతీమాత ఆశీస్సులతో జహీరాబాద్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. అభివృద్ధికి తనవంతగా సహకరిస్తానన్నారు. జాతర ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చూడాలన్నారు. మోతీమాత ఆలయం వద్ద హెల్త్‌సబ్‌సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంత అభివృద్ధిపై మంత్రి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రోడ్లు అధ్వాన్నంగా మారడంతో ప్రజలకు రాకపోకల విషయంలో ఇబ్బందులు పడుతున్నారని ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్సూద్, రాంలింగారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు నాయకులు, కార్యకర్తలు, భక్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో

కలకలం



(ఫైల్ ఫొటో)

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎంను కలవడంపై ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చర్చ
- బీఆర్‌ఎస్ కార్యకర్తల్లో అయోమయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జనవరి 25 : అనుకున్నదొకటి.. అయిందొకటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన నలుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మదనపడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ముఖ్యనేతల నడుమ వాడీవేడిగా విమర్శలు, ఆరోపణలు సాగుతున్న సమయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, ప్రొటోకాల్ ఇబ్బందులు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి అదనపు సెక్యూరిటీ వంటి వాటి కోసం ఉమ్మడి జిల్లాలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొత్తప్రభాకర్‌రెడ్డి, వి.సునీతారెడ్డి, జి.మహిపాల్‌రెడ్డి, కె.మాణిక్‌రావు రెండ్రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అంతకుముందే లండన్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వందమీటర్ల లోతులో పాతిపెడతామని వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్‌లోని 30 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా అన్నారు. ఈ సందర్భంలో నలుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నది. త్వరలోనే లోక్‌సభ ఎన్నికలు జరగనుండడం, ఆ వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న పరిస్థితులలో ఈ నలుగురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలవడం బీఆర్‌ఎస్ కర్యకర్తలను సైతం కలవరానికి గురిచేసింది. వీరు నిజంగానే సమస్యల పరిష్కారం కోసమే కలిశారా? అన్న దానిపైపార్టీ వర్గాల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రొటోకాల్ సమస్యలు లేని జహీరాబాద్ ఎమ్మెల్యే వీరితో కలిసిరావడం.. సమస్యలున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ లేకపోవడం కూడా సందేహాలకు తావిస్తున్నది.

మంత్రులను కలిస్తే లేని తప్పు...

నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం తాము ఇంతకుముందు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రాలు ఇచ్చామని, అప్పుడు ఏ సమస్య ఎదురవలేదని నలుగురు ఎమ్మెల్యేలంటున్నారు. తాము ముఖ్యమంత్రిని కలవడంతో రాజకీయం ఏమీలేదని వారు స్పష్టం చేస్తున్నారు. మంత్రులను కలిసినట్టే ముఖ్యమంత్రిని కలిశామని, దీనికి ఇంత రాద్ధాంతం చేయడం తగదని వారంటున్నారు. తాము కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని వారు చెబుతున్నారు.

నియోజకవర్గాల్లో ఇబ్బందులు

దుబ్బాక, నర్సాపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ వర్గాల నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యేలను లెక్కచేయకుండా అధికారిక కార్యక్రమాలను సైతం కాంగ్రెస్ నాయకులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల నడుమ గొడవలు సైతం చెలరేగాయి. వీటన్నింటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చేందుకే తాము కలిశామని ఎమ్మెల్యేలు చెబుతున్నారు. అయినా వీరు ముఖ్యమంత్రిని కలిసిన సమయం సరికాకపోవడం వల్లనే ఈ అంశం కాస్త వివాదాస్పదవవుతున్నది. అయితే ఈ నలుగురు ఎమ్మెల్యేల్లో ఒక ఎమ్మెల్యేపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదురు ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో అనేక భూవివాదాల్లో పాలుపంచుకున్నట్టు ఆరోపణలున్నాయి. వీటి నుంచి బయటపడేందుకు ఎప్పుడో ఒకసారి బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి అధికార పార్టీలో చేరవచ్చన్న అభిప్రాయం సొంతపార్టీ వర్గాల్లోనే వ్యక్తమవుతున్నది.

క్యాంపునకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎంపిక కోసం కసరత్తు

నర్సాపూర్, జనవరి 25: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎంపిక కోసం బీఆర్‌ఎస్ కసరత్తు మొదలుపెట్టింది. ముందుజాగ్రతలో తమ పార్టీ కౌన్సిలర్లను గురువారం క్యాంపునకు తరలించారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న మురళీధర్‌యాదవ్ పదవికి రాజీనామా చేయడంతో ప్రస్తుతం తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ నయీమొద్దీన్ వ్యవహరిస్తున్నారు. కొత్త చైర్మన్ ఎంపిక కోసం అధికారులు ఈ నెల 29న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్ బలం తొమ్మిది మంది కాగా.. బీజేపీకి ఆరుగురు కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్‌కు చైర్మన్ పదవి కోసం కావాల్సిన కౌన్సిలర్లు ఉండడంతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బలం కూడా ఉంది. చైర్మన్ పదవిని ఒకటోవార్డుకు చెందిన అశోక్‌గౌడ్‌కు ఇవ్వాలని భావిస్తున్నారు. వైస్‌చైర్మన్ నయీమొద్దీన్ కూడా చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవ తీసుకుని కౌన్సిలర్లకు నచ్చజెప్పి అశోక్‌గౌడ్‌ను చైర్మన్‌గా ఎన్నుకోవాలని సూచించినట్లు తెలిసింది. అయితే ఇందుకు నయిమొద్దీన్ ససేమిరా అంటున్నారు. అవసరమైతే పార్టీకి రాజీనామా చేస్తానంటూ అనుచరుల వద్ద అన్నట్టు తెలిసింది. దీంతో పార్టీ నాయకత్వం అశోక్‌గౌడ్‌కు అవకాశమిచ్చినందున సహకరించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి నయిమొద్దీన్‌కు నచ్చజెప్పినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఈ నెల 29వ తేదీ వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యాంపుకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను క్యాంపునకు తరలించినట్టు తెలిసింది.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



సభలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 25 : మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డిలో గురువారం నిర్వహించిన మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎంచుకున్న రంగంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు. మహిళలు స్వయంఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంభన సాధించాలని పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిత్‌కుమార్ మాట్లాడుతూ స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలకు రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సూర్య ప్రకాష్‌రావు, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ ఫహీమ్‌షేక్, సంస్థ డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్, శిక్షకుడు శివశంకర్, నర్సింహులు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో ఓటరు దినోత్సవం ర్యాలీ

ఓటు వజ్రాయుధం

- ఓటేయడం ప్రతీ ఒక్కరి బాధ్యత
- సంగారెడ్డి జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు
- నిజాయితీగా ఓటు వేయాలి : కలెక్టర్ క్రాంతి
- ప్రజాస్వామ్యంలో ఓటే అత్యంత విలువైనది : ఎస్పీ రూపేష్

సంగారెడ్డి రూరల్, జనవరి 25: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని సంగారెడ్డి జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో కళాకారులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల్లోని వారు కులమతాలకతీతంగా సామూహికంగా జరుపుకునే పండుగ ఓటరు దినోత్సవమని చెప్పారు. హక్కులతో పాటు బాధ్యతలు ఉంటాయని, మనం సక్రమంగా తమ ఓటు హక్కుని వినియోగించుకున్నప్పుడే హక్కుల కోసం ప్రశ్నించవచ్చని సూచించారు. ఓటేసి మంచి నాయకులను ఎన్నుకోవాలన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి

ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించుకున్నామని, రానున్న ఎంపీ ఎన్నికల్లో అందరూ పాల్గొనాలన్నారు. జిల్లాలో 1,42,4123 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 7,08,123 మంది మహిళలు, 128 మంది థర్డ్ జెండర్లు, 18 సంత్సరాలు నిండివారు 4,3834 మంది ఓటర్లు ఉన్నారని ఆమె వివరించారు. ఓటుహక్కు ఉన్న వారందరూ కచ్చితంగా ఓటేయాలని కలెక్టర్ క్రాంతి కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా గొప్పదని అన్నారు. ఎన్నికల సంఘం ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు, సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. ప్రతీ ఒక్కరూ స్వేచ్ఛా వాతావరణంలో ఓటువేసే అవకాశం ఉందని, సమాజంలో మనమూ ఒక భాగమేనని ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ఓటు హక్కుని వినియోగించుకోవాలని సూచించారు. బాధ్యతలను విస్మరించకుండా హక్కుల కోసం పోరాడాలని ఎస్పీ అన్నారు. అనంతరం అధికారులు, పౌరులతో ప్రతిజ్ఞ చేయించి ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో నగేష్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ డేను పండుగలా నిర్వహించాలి

రాష్ట్రంలో పోలింగ్ నమోదులో ద్వితీయ స్థానంలో మెదక్ : కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 25: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధంలాంటిదని అర్హులైన ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం స్వీప్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని పోస్టాఫీసు నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధితో కూడిన సుస్థిర ప్రజాస్వామ్యాన్ని ఒక్క ఓటుతోనే సాధించుకోగలమన్నారు. ఓటింగ్ డేను మనందరం పండుగలా నిర్వహించుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ నమోదులో రాష్ట్రంలోనే మెదక్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఓటరు నమోదులో బీఎల్‌వోల సేవలను కొనియాడారు. భారత రాజ్యాంగం చాలా గొప్పదన్నారు. రాబోయే ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కుని వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా స్వీప్ కార్యక్రమాలపై నిర్వహించిన ఉపన్యాసం, వ్యాసరచన, నాటక, పాటలు, చిత్రలేఖనం, పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో ఓటరు అవగాహన ర్యాలీలో కలెక్టర్ రాజర్షిషా

నర్సాపూర్ కస్తూర్బా విద్యార్థులకు రాష్ట్రస్థాయి మొదటి బహుమతి

- ఓటు ప్రాధాన్యతపై వ్యాసరచన పోటీలు
- బహుమతి అందజేసిన గవర్నర్



గవర్నర్ నుంచి బహుమతి అందుకుంటున్న నర్సాపూర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థులు

నర్సాపూర్, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సమీపంలోని కస్తూర్బా విద్యాలయం ఇంటర్ విద్యార్థులు మొదటి బహుమతిని గవర్నర్ తమిళిసై నుంచి అందుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై మొదటి బహుమతిని నర్సాపూర్ కస్తూర్బా విద్యార్థులకు బహుమతి అందజేసినట్లు స్పెషల్ ఆఫీసర్ స్వేత పేర్కొన్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఓటు విలువ దాని ఆవశ్యకతపై నిర్వహించిన పోటీలో ప్రతిభ చూపి మొదటి బహుమతి దక్కించుకుని గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఇందుకు విద్యార్థులకు కస్తూర్బా పాఠశాల తరపున అభినందనలు తెలిపారు.





సంగారెడ్డిలోని పరేడ్‌గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది, స్టేజీ వద్ద జాగిలంతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

గణతంత్ర వేడుకలకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గురువారం అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా ప్రదర్శించే శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా శాఖల అధికారులు ఆసీనులయ్యేందుకు స్టేజీలను సిద్ధం చేశారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన, వివిధ పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు.

-మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, జనవరి 25





మెదక్‌లో ముస్తాబైన పోలీస్ పరేడ్‌గ్రౌండ్

ఉత్తమ డీఎంహెచ్‌వోగా చందునాయక్

మెదక్ అర్బన్, జనవరి 25: భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ జిల్లా వైద్యాధికారిగా మెదక్ జిల్లా డీఎంహెచ్‌వో డా. చందునాయక్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో గురువారం నిర్వహించిన 2022-23 ఏడాది సమీక్షలో రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి డా.క్రిస్టినాజెడ్ చొంగ్తు, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీకర్ణన్ నుంచి ఆయన అవార్డును అందుకున్నారు. మెదక్ జిల్లా మెటర్నల్ హెల్త్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు, చైల్డ్ హెల్త్, ఇమ్యూనైజేషన్‌లో 11వ ర్యాంకు, ఎనిమియా ముక్త్ భారత్‌లో 26వ ర్యాంకు, టీబీలో ఫస్ట్ ర్యాంకు, తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పరీక్షల నిర్వహణలో ద్వితీయస్థానం, ఎన్సీడీలో 1వ ర్యాంకు సాధించినందుకు బెస్ట్ డీఎంహెచ్‌వోగా ఆయనకు అవార్డు లభించింది.

మీరు ప్రయత్నిస్తున్న నంబరు అందుబాటులో లేదు!

- కొమురవెల్లి మల్లన్న చెంత సిగ్నల్స్ చింత

చేర్యాల, జనవరి 25: ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా జాతరవారం వచ్చిందటే చాలు సెల్‌ఫోన్లు మూగబోతున్నాయి. ప్రతీవారం భక్తులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా ఉండక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకేంద్రంతో పాటు జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న కొమురవెల్లిలో సెల్ సిగ్నల్స్ సక్రమంగా పని చేయకపోవడంతో భక్తులు ఉసూరుమంటున్నారు. ప్రతి సంవత్సరం మూడునెలల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, ఆంధ్రా, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. అయితే ఇక్కడ అన్నిరకాల సెల్‌నెట్‌వర్క్‌లు దాదాపుగా అందుబాటులో ఉన్నప్పటికీ జాతర సమయంలో భక్తుల రద్దీ వల్ల ఫ్రీక్వెన్సీ తగ్గి ఫోన్‌లు చేస్తే కలవని పరిస్థితి. ఫలితంగా భక్తులకు సరైన సమాచారం తెలియక ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా అధికారుల పర్యవేక్షణ, సమన్వయం కొరవడుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాధారణంగా ఒకసారి డయల్ చేయడంతోనే కనెక్ట్ అవుతుంది. జాతర సమయంలో మాత్రం ఓ పదిసార్లు ప్రయత్నిస్తే కానీ కనెక్ట్ కాదు. ఒకవేళ కనెక్ట్ అయినా వాయిస్ సరిగా వినపడదు. ప్రతి ఏటా సమీక్షా సమావేశాల్లో సెల్‌సిగ్నల్స్ గురించి ప్రస్తావిస్తారు. మొబైల్ టవర్స్ ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా ఆచరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో భక్తులు ఫోన్ చేసుకోవాలంటే పొరుగు గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కొందరు సిగ్నల్స్ కోసం కొండలు, గుట్టలు, భవనాల పైకి ఎక్కి ఫోన్ మాట్లాడే క్రమంలో ప్రమాదాలబారిన పడే అవకాశం లేకపోలేదు. జాతరలో ఎవరన్న తప్పిపోయి తమ కుటుంబీల కోసం ఫోన్ చేస్తే కలవక ఆందోళనకు గురవుతున్నారు.

దేశంలో శక్తివంతమైన ప్రజాస్వామ్యం

● నల్సార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు

పటాన్‌చెరు రూరల్, జనవరి 25 : మనది శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశమని, చట్టబద్ధ పాలన, రాజ్యాంగ ఆధిపత్యం, నిష్పాక్షికత, అందుబాటులో ఉండే న్యాయవ్యవస్థ వంటి ప్రధాన స్తంభాలపై నిలిచిన రాజ్యాంగం సొంతమని నల్సార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు చెప్పారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా 'రాజ్యాంగం - సామాన్యుడిపై దాని ప్రభావం' అనే అంశంపై గురువారం ఆయన గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కార్యక్రమంలో ఆతిథ్య ఉపన్యాసం చేశారు. రాజ్యాంగాన్ని ప్రతీ పౌరుడూ చదవాల్సిన అవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. ముందుగా రాజ్యాంగాన్ని ఆకళింపు చేసుకుని, అందులో పొందుపరచిన ప్రాథమిక హక్కులు, నిర్దేశక సూత్రాలను అర్థం చేసుకుని ఒక అభిప్రాయానికి రావొచ్చని ప్రొఫెసర్ రావు సూచించారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పీఐఎల్) ప్రాముఖ్యతను వివరించారు. రాజ్యాంగం ఏడు ఆలోచనలు, లక్ష్యాలు, రూపకల్పన, ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, విధులు, మార్పుల గురించి విడమరిచి చెప్పారు. రాజ్యాంగం సజీవ పత్రమని, స్వాతంత్ర్య పోరాట విలువలను ప్రతిబింబిస్తూ న్యాయమైన, స్వేచ్ఛాయుత సమాజాన్ని సృష్టించేందుకు కృషి చేస్తోందన్నారు. కేశవానంద భారతి, మేనకా గాంధీ, అయోధ్య తీర్పు వంటి పలు మైలురాళ్ల వంటి కేసులను ఉటంకించారు. గీతం గ్రంథాలయానికి రాజ్యాంగ ప్రతులను ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు విరాళంగా ఇచ్చారు. పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీఎహెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ జి.జోస్ స్వాగతోపన్యాసం చేశారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు

వీరభద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీ హోమం



బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు, ఆలయ సిబ్బంది

గుమ్మడిదల, జనవరి 25 : గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో గురువారం చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెల పౌర్ణమి రోజు ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహించి వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారి అనుగ్రహాన్ని పొందుతారు. వేద పండితులు మంత్రోచ్ఛరణాల మధ్య హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ సీనియర్ పర్యవేక్షకులు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో మాధవానందస్వామి పూజలు

నర్సాపూర్, జనవరి 25: నర్సాపూర్ మండలం గొల్లపల్లిలోని కేతకీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పూజ కార్యక్రమంలో మాధవానందస్వామి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వాల్దాసమల్లేశ్‌గౌడ్ దంపతులతో పాటు పలువురు పాల్గొన్నారు.

చిన్నగొట్టిముక్కలో దుర్గమ్మ జాతర

శివ్వంపేట, జనవరి 25: మండలంలోని చిన్నగొట్టిముక్క గ్రామంలో దుర్గమ్మ జాతర సందర్భంగా గురువారం ఊరడమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలమణినరేందర్, ఎంపీటీసీ దశరథ్, నాయకులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఓడినా రఘునందన్‌కు జ్ఞానోదయం కాలేదు

- ఇష్టారీతిగా మాట్లాడితే సహించేది లేదు
- కాంగ్రెస్ నేతలకు మాటలు తప్ప చేతలు లేవు
- అభివృద్ధి పనుల కోసం సీఎంను కలిస్తే తప్పేంటి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజం

తొగుట, జనవరి 25 : అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో ఓటమి పాలైనా రఘునందన్‌రావుకు జ్ఞానోదయం కాలేదని, ఇష్టారీతిగా మాట్లాడితే సహించేది లేదని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కొత్త ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన ఓటమి ఎరుగని నేత హరీశ్‌రావు అని, ఆయనపై రఘునందన్‌రావు ప్రేలాపణలు సిగ్గుచేటన్నారు. దుబ్బాక ఉపఎన్నికల్లో అత్తెసరు ఓట్లతో గెలిచిన ఆయన నాడు ఇచ్చిన ఒక హామీనైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. తాను సీఎంను కలవడమే పాపం అన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం కాంగ్రెస్ పార్టీకా.. లేక రాష్ట్రానికా అనేది తెల్వకపోవడం దౌర్భాగ్యం అన్నారు.


జప్తిలింగారెడ్డిపల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న కొత్త ప్రభాకర్

ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం కోసం ఎమ్మెల్యేగా ప్రభుత్వంలో ఉన్న మంత్రులను కలిస్తే తప్పేంటి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భారత ప్రధాని నరేంద్రమోదీని కలిస్తే అపుడు నోళ్లు ఎందుకు మూసుకుపోయాయని రఘునందన్‌రావుపై మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలవి మాటలు తప్ప చేతలు ఏమి లేవని ఎద్దేవా చేశారు. గతంలో రైతులు మంత్రికి ఒక్కఫోన్ కాల్ చేస్తే మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను కూడవెళ్లి వాగులోకి విడిచిపెట్టే వారని చెప్పారు. ఇపుడు స్వయంగా మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం చూస్తే వారికి రైతుల పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం భేషజాలకు పోకుండా రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి సాగునీటిని విడుదల చేయాలని కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. అంతకు ముందు మల్లన్నసాగర్ నుంచి దుబ్బాకకు సాగునీరు వెళ్లే ప్రధాన కాలువ వద్దకు చేరుకుని పరిశీలించారు. అనంతరం మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి, పెద్ద మాసాన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట, వర్దరాజ్‌పల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ, రైతువేదిక భవనాలను ప్రారంభించారు. వివిధ గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీహాల్, గౌడ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటయ్య, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు చిలివేరి జ్యోతి మల్లారెడ్డి, చత్రి కనకవ్వ, మల్లయ్య, నాయకులు స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ తయారీ ముడిసరుకు స్వాధీనం

- నందికంది దాబాలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి
- పాపి స్ట్రా పౌడర్‌ను విక్రయిస్తుండగా ఇద్దరి అరెస్టు
- నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారు


స్వాధీనం చేసుకున్న పౌడర్‌ను, నిందితులను చూపుతున్న పోలీసులు

సదాశివపేట, జనవరి 25 : సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులోని ఓదాబా హోటల్‌లో బుధవారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి డ్రగ్స్ తయారీ ముడిసరకును స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు నందికంది గ్రామ సమీపంలోని రామ్‌దేవ్ రాజస్థాన్ దాబా హోటల్‌లో బుధవారం దాడి చేశారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ములారామ్, జగ్‌జీవన్ సాయంత్రం 5 గంటల సమయంలో రూ.లక్ష విలువ చేసే 210 గ్రాముల పాపి స్ట్రా పౌడర్‌ను విక్రయిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా హెరాయిన్ డ్రగ్స్ తయారీలో ఉపయోగించే పాపి స్ట్రా పౌడర్‌ను రాజస్థాన్ నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు కె.శ్రీనివాస్‌రావు తెలిపారు.

నార్సింగిలో తేనెటీగల దాడి

- 20 మందికిపైగా గాయాలు


గాయపడిన బాలుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

మాసాయిపేట, జనవరి 25 : తేనెటీగల గుంపు దాడి చేయడంతో 20 మందికి పైగా గాయాలైన ఘటన గురువారం నార్సింగి మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో చోటుచేసుకున్నది. మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో ఓ చెట్టుపైన ఉన్న తేనెతుట్ట ఉంది. ఆ చెట్లపై కోతులు దూకుతూ కొమ్మలపై వేలాడుతుండగా తేనెతుట్టకు తగిలాయి. దీంతో ఒక్కసారిగా తేనేటీగల గుంపు లేచి అక్కడ ఉన్న వారిపై దాడి చేశాయి. చెట్ల కింద కూర్చున్న వారిపై, ఆ ప్రాంతంలో నుంచి వెళ్తున్న బాటసారులను కుట్టాయి. నార్సింగి వడ్డెర కాలనీకి చెందిన కొంత మంది ఒక పంచాయితీ విషయమై చెట్ల వద్ద కూర్చుని మాట్లాడుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నది. సుమారు 20మంది వరకు గాయపడ్డారు. అంతేకాకుండా పాఠశాల నుంచి మధ్యాహ్న భోజనం కోసం వసతిగృహానికి వెళ్తున్న హాస్టల్ విద్యార్థులు కూడా గాయపడ్డారు. వీరిలో రామచంద్రం, లింగయ్య, నారాయణ తీవ్రంగా గాయపడగా మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

మోతీమాతా.. దీవించమ్మా

- అంగరంగ వైభవంగా మరిగమ్మ జాతర
- చివరి రోజు ఉత్సవాలకు తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు


ఉప్పర్‌తండా మోతీమాత జాతరలో జనసందోహం

జహీరాబాద్, జనవరి 25 : మమ్మేలు మాఅమ్మా.. మరిగమ్మ మోతీమాతా.. దీవించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌తండాలో రెండు రోజులపాటు నిర్వహించిన మోతీమాత జాతర ఉత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగాయి. గురువారం జాతర చివరి రోజు కావడంతో మోతీమాతను దర్శించుకోవడానికి జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. రెండుకిలోమీటర్ల మేర భక్తులు టెంట్లను ఏర్పాటు చేసుకుని అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ప్రముఖులు మరిగమ్మ మోతీమాతను దర్శించుకుకోవడానికి తరలివచ్చారు. మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, నేతలు నరోత్తం, తన్వీర్, జైపాల్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అడవిబిడ్డల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు కోరుకున్నారు. బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ శంకర్‌నాయక్ ఆలయాభివృద్ధికి రూ.10లక్షలు ఇవ్వాలని ఎంపీ బీబీపాటిల్‌ను కోరగా వెంటనే మంజూరు చేస్తానని హామీఇచ్చారు. అలాగే జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కూడా తనవంతు బాధ్యతతో రూ.5 లక్షలను ఇస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల గురువైన గోవింద్‌హరాజ్‌ను ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

జాతీయ రహదారి వెంట అక్రమ నిర్మాణాలు

- ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కోసం జిమ్మిక్కులు
- రోడ్ల విస్తరణకు గ్రీన్‌సిగ్నల్‌తో అక్రమార్కుల వక్రబుద్ధి
- మున్సిపల్ నుంచి దొడ్డిదారిన ఇంటి నంబర్లు




పోతిరెడ్డిపల్లి, కంది శివారులో జాతీయ రహదారి పక్కనే అక్రమ నిర్మాణాలు

సంగారెడ్డి టౌన్, జనవరి 25 : భూముల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. జాతీయరహదారి విస్తరణలో నష్టపరిహారం కోసం జిమ్మిక్కులు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో జాతీయరహదారికి ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయల విలువైన భూములు కబ్జా కావడమేగాక రోడ్లు కుదించుకుపోయి ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

65వ నంబరు జాతీయరహదారికి ఇరువైపులా ..

జాతీయరహదారికి ఇరువైపులా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాదారులు వాటిపై కన్నేసి నిర్మాణాలు చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి-కంది, మల్కాపూర్ మధ్య ఉన్న 65వ నంబరు జాతీయరహదారికి ఇరువైపులా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ రహదారిని ఆరులేన్లుగా విస్తరించేందుకు నేషనల్ హైవే అథారిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఏవైనా నిర్మాణాలుంటే వాటిని గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఏ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది పోతిరెడ్డిపల్లి - కంది - మల్కాపూర్ మధ్య ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా చిన్నచిన్న దుకాణాలను అక్రమంగా నిర్మించి అద్దెకు ఇచ్చారు. మున్సిపాలిటీలో ఇంటి నంబర్లతో పాటు ట్రాన్స్‌కో నుంచి కరెంట్ మీటర్లు సైతం పొందారు. చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. రోడ్డుకు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపులైన్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై పలువురు మున్సిపల్, రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

కలెక్టర్ విచారణ చేపట్టాలి

జిల్లాలో ప్రభుత్వ భూములను రక్షించాలని, జాతీయ రహదారికి ఇరువైపులా చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని పలువురు పట్టణ ప్రజలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరు నెలల నుంచి 65వ జాతీయ రహదారిపై అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇస్తున్న దందా కొనసాగుతోందని, ఇప్పటివరకు ఏ అధికారి పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు ఏ విధంగా ఇంటి నంబర్లు కేటాయించారో? ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ మీటర్లు ఎలా ఇచ్చారో విచారణ జరపాలని పలువురు కలెక్టర్‌ను కోరుతున్నారు.

పార్కులకు గ్రహణం

- సిద్దిపేటలో పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అన్యాక్రాంతమవుతున్న పార్కు స్థలాలు

సిద్దిపేట టౌన్, జనవరి 25 : సిద్దిపేట పట్టణంలో పలు పార్కులు పర్యాటకులకు ఆహ్లాదానివ్వలేకపోతున్నాయి. పట్టణవాసులు కాసేపు ఉపశమనం పొందేందుకు పార్కులకు వెళ్దామనుకుంటే మూసి ఉంటున్నాయి. సిద్దిపేటలో ఐదు పార్కులుండగా రెండు మినహా ఏ పార్కులోనూ వసతులు లేకపోవడం, ఇతరత్రా కారణాలతో ఎల్లప్పుడూ మూసే ఉంటున్నాయి.

పార్కు గేట్లకు తాళం

సిద్దిపేట పట్టణంలో ఐదు పార్కులు ఉండగా వీటిలో పట్టణంలోని నడిబొడ్డున మైత్రివనం, హౌజింగ్‌బోర్డు కమాన్ వద్ద ఉన్న పార్కులు మినహా అందుబాటులో ఉంచడం లేదు. విక్టరీ థియేటర్ వద్ద మహాత్మ గాంధీపార్కు, మంగమ్మతోట పార్కు గేట్లకు తాళాలే దర్శనమిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం సిద్దిపేట పట్టణంలో శిథిలావస్థకు చేరడంతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన మేరకు మున్సిపల్ పాలకవర్గం, అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి మహాత్మగాంధీ పార్కుగా నామకరణం చేసి అద్భుతంగా తీర్చిదిద్దారు. కొన్నాళ్ల నుంచి పార్కును మూసే ఉంటుంది. చుట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న మహాత్మ గాంధీ పార్కు మూసివేయడంతో వ్యాయామదారులు, వాకర్లు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. పార్కులో ఏమైనా సమస్యలుంటే వాటిని మరమతు చేయించి పునఃప్రారంభించాలని కోరుతున్నారు.


సిద్దిపేట పట్టణంలో మూసి ఉన్న మహాత్మ గాంధీ పార్కు


కబ్జాకు గురైన చిల్డ్రన్స్ పార్కు స్థలంలో ప్రహరీని కూల్చిన మున్సిపల్ సిబ్బంది

మహాత్మ గాంధీ పార్కు స్థలం కబ్జాకు యత్నం

మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పార్కు స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. మహాత్మ గాంధీ పార్కుతో పాటు, పక్కనే పలు పరికరాలతో చిల్డ్రన్ పార్కును గతంలోనే ఏర్పాటు చేశారు. మహాత్మ గాంధీ పార్కు మూసివేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికిరాత్రే కబ్జా చేసే ప్రయత్నం చేశారు. కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి వెళ్లడంతో స్పందించి వాటిని కూల్చివేశారు.

45 రోజులు.. రూ.1.39 కోట్లు

- కొమురవెల్లి మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు
- రికార్డుస్థాయిలో సమకూరిన ఆదాయం
- రెండేళ్ల కిత్రం రూ.1.28 కోట్లు


హుండీలో లభ్యమైన కోరమీసం

చేర్యాల, జనవరి 25 : కొమురవెల్లి మల్లన్న కానుకల హుండీలలో కాసుల గలగల పారింది. ఆలయ చరిత్రలో లేని విధంగా రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఆలయంలో గురువారం ముఖమండపంలో ఈవో బాలాజీ శర్మ ఆధ్వర్యంలో సత్యసాయి మహిళా సేవా సమితి సభ్యులు కానుకలు, ఒడిబియ్యం లెక్కింపు చేపట్టారు. ఉదయం ప్రారంభించిన కరెన్సీ లెక్కింపు రాత్రి వరకు కొనసాగగా రూ.1,39,77,230 నగదు, 68గ్రాముల బంగారం, 14.80 కిలోల వెండి, 25 క్వింటాళ్ల బియ్యం, విదేశీ కరెన్సీనోట్లు 15 లభ్యమయ్యాయి. ఈనెల7న నిర్వహించిన స్వామి వారి కల్యాణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలతో పాటు మేడారం సమ్మక్క- సారలమ్మను దర్శించుకున్న భక్తులు వేలాదిగా తరలి వస్తున్నారు. ఇటీవల పట్నం వారానికి లక్షమందికిపైగా భక్తులు చేరుకుని దండిగా కానుకలు సమర్పించడంతో హుండీలు నిండిపోయాయి. 45 రోజుల్లోనే రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. గతంలో అత్యధికంగా రెండేళ్ల క్రితం రూ.1.28 కోట్లు ఆదాయం రాగా, ఈఏడాది అంతకుమించి ఆదాయం సమకూరింది.


హుండీలోని విదేశీ కరెన్సీ

ఖేలో ఇండియా సౌత్ జోన్ యోగా పోటీలకు గజ్వేల్ విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థినులు అంకిత, వైష్ణవి

గజ్వేల్, జనవరి 25: ఖేలో ఇండియా సౌత్ జోన్ జాతీయ యోగా పోటీలకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారిణీలు ఎం.అంకిత, ఎస్.వైష్ణవి ఎంపికయ్యారని, 27, 28 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం దిండుగల్‌లోని పీఎస్ఎన్ఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరిగే ఖేలో ఇండియా సౌత్ జోన్ ఉమెన్స్ యోగా పోటీల్లో పాల్గొంటారని పీఈటీ పేర్కొన్నారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

తొలి రోజే సగం మందికి రక్తహీనత నిర్ధారణ

- వెయ్యి మందికిపైగా పరీక్షలు
- సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది బృందాలతో స్క్రీనింగ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 25 : విద్యార్థుల్లో రక్తహీనత సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. 'ఎనీమియా ముక్త్ తెలంగాణ' కార్యక్రమం కింద చేపట్టిన స్క్రీనింగ్ ద్వారా ఈ విషయం స్పష్టమవుతున్నది. వైద్య ఆరోగ్య శాఖ 'ఎనీమియా ముక్త్ తెలంగాణ' పేరిట శ్రీకారం చుట్టిన కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేటలో బుధవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలిరోజు 1,083 మందికి స్క్రీనింగ్ చేయగా 580 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్టు తేలింది.

మార్చి 15 వరకు కొనసాగనున్న స్క్రీనింగ్

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 249 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 8, 9, 10 వ తరగతి, 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ఫస్ట్, సెకండియర్ విద్యార్థులకు ఉచితంగా రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. మార్చి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నది. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కె)కు చెందిన తొమ్మిది వైద్య బృందాలు పరీక్షలను నిర్వహిస్తాయి. జిల్లావ్యాప్తంగా 57,478 మంది విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయాలనే లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో బాలికలు 32,153 మంది ఉండగా, బాలురు 25,325 మంది ఉన్నారు. ప్రతీ బృందంలో ఒక మేల్, ఒక ఫిమేల్ మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఫార్మసిస్టు ఉంటారు. నిత్యం సుమారు 100-200 మందికి పరీక్షలు చేస్తారు. వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌బీఎస్‌కే బృందాలు హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించి 12 శాతం కన్నా హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటే అప్పటికప్పుడు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. అంతే కాకుండా పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని పిల్లలకు సూచనలు ఇస్తున్నారు.


సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రక్తహీనత పరీక్షలు చేస్తున్న ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది

580 మందికి రక్తహీనత

స్క్రీనింగ్ కార్యక్రమం ద్వారా తొలి రోజు 1083 మందికి స్క్రీనింగ్ చేశారు. ఇందులో హిమోగ్లోబిన్ 8 గ్రాముల కంటే తక్కువగా ఉంటే తీవ్రంగా పరిగణిస్తారు. 8-10.9 శాతం ఉన్న వారిని మధ్యమంగా, 11 నుంచి 11.9 శాతం ఉంటే తేలికపాటి(మైల్డ్)గా పరిగణిస్తారు. 12 శాతంపైగా ఉంటే సాధారణంగా గుర్తిస్తారు. ఈ విధంగా తొలి రోజు 8 గ్రాముల కంటే తక్కువగా ఉన్న వారు 46 మంది, మధ్యమంగా ఉన్న వారు 220 మంది, మైల్డ్‌గా ఉన్న వారు 314 మంది మొత్తంగా 580 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్టు తేలింది. అంటే తొలిరోజు సగం మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు స్క్రీనింగ్‌లో స్పష్టమవుతున్నది. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి సరైన చికిత్స అందించి రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దేదుకు కృషి చేస్తామని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే తెలిపారు.

కస్తూర్బా విద్యాలయాల్లో 'వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రోగ్రాం' షురూ


ఆర్సీపురంలోని ఉస్మాన్‌నగర్ కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 25 : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ) వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమం ప్రారంభమైంది. కౌమార దశలో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం ఆర్సీపురంలోని ఉస్మాన్‌నగర్, కొండాపూర్ కేజీబీవీలో వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ వలంటీర్లు అవగాహన కల్పించారు. బాలికల ఆరోగ్యం, సేఫ్టీ, హక్కులు, భవిష్యత్తు ప్రణాళిక, భద్రత, నైతిక విలువలు, సమాజంలో ఎలా జీవించాలి, మంచి చెడు తదితర అంశాలపై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామం నుంచి రహదారి వద్దు

- సర్వే అధికారులకు విన్నవించిన చిన్నగుండవెల్లి గ్రామస్థులు


పంచాయతీ భవనంలో రైతులతో మాట్లాడుతున్న సర్వే అధికారులు

సిద్దిపేటరూరల్, జనవరి 25: సిద్దిపేట రూరల్ మండలంలోని చిన్నగుండవెల్లి గ్రామంలో రహదారి నిర్మాణానికి భూ సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. గ్రామం రైతులు, గ్రామ పాలకవర్గ సభ్యులు అధికారులను గ్రామపంచాయతీకి పిలిపించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామం మీదుగా మల్లన్నసాగర్ కెనాల్ (అండర్ గ్రౌండ్) నిర్మాణం జరిగిందని, సోలార్ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు వేశారని, దీంతో రైతులకు అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయని వాపోయారు. గ్రామం మీదుగా ఇప్పుడు రహదారి నిర్మిస్తామంటే మొత్తానికి నష్టం జరుగుతుందని వెల్లడించారు. తమ గ్రామం మీదుగా ఎలాంటి రహదారులు నిర్మించొద్దంటూ గ్రామపంచాయతీ వద్ద తీర్మానం చేసి సర్వే చేసేందుకు వచ్చిన అధికారులకు అందజేశారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. గురువారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. పట్టణాల్లో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటు ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పలు పట్టణాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి చేపట్టిన నమో నవ యువ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ సందేశాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా యువతకు వినిపించారు.

నర్సాపూర్, జనవరి 25: నర్సాపూర్ పట్టణంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో నమో నవ యువ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం జాతీయ సమన్వయ కర్త కుమార్‌యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ రమణరావు, పట్టణాధ్యక్షుడు అంజిగౌడ్, హరీష్, రాజేష్, భరత్ పాల్గొన్నారు.

● **సంగారెడ్డి అర్బన్:** సంగారెడ్డిలో బీజేవైఎం ఆధ్వర్యంలో నమో నవ యువ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి పులిమామిడి రాజు, అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాకేశ్, రాజశేఖర్, వెంకటనర్సింహ్మారెడ్డి, సందీప్, ప్రవీణ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

●**మెదక్ అర్బన్:** బీజేవైఎం ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో నవ యువ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్, నియోజకవర్గ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయ్, సుధాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** ఆర్డీవో నలవాల వెంకటేష్ ఆధ్వర్యంలో ఖేడ్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవదాస్ పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నమో నవ యువ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, నాయకులు పాల్గొన్నారు.

●**గుమ్మడిదల:** తహసీల్దార్ గంగాభవాని ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ కర్ణాకర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

● **మనోహరాబాద్:** తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఆర్ఐ దీక్షిత్ పాల్గొన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మనోహరాబాద్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని ఆరీభాఖాన్ రెండవ బహుమతి పొందింది. కలెక్టర్ రాజార్షిషా గురువారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

● **పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేటలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శర్దప్ప, పీజీ హెచ్ఎంలు వెంకటేశం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

●**శివ్వంపేట:** శివ్వంపేటలో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఆర్ఐ కిషన్, ఎంపీవో తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

●**పాపన్నపేట:** తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో పాపన్నపేట కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

●**వెల్దుర్తి:** తహసీల్దార్ తులసీరామ్ ఆధ్వర్యంలో వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏంఈవో యాదగిరి, ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ పాల్గొన్నారు.

●**కంగ్టి:** కంగ్టిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ విష్ణుసాగర్ వృద్ధ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముజాఫరోద్దీన్, డీటీ జుబేదర్, కార్యదర్శి సుభాష్, సర్పంచు సుగుణ పాల్గొన్నారు.

●**నాగల్‌గిద్ద:** మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

●**తూప్రాన్:** పట్టణంలో తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

●**పుల్‌కల్:** పుల్కల్, చౌటకూర్‌లో తహసీల్దార్లు భాస్కర్‌కుమార్, ఈశ్వరీరాణి ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

●**టేక్మాల్:** మండల కేంద్రంలో తహసీల్దార్ తహసీల్దార్ క్రిష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రియాజోద్దిన్, ఆర్ఐ సాయి శ్రీకాంత్, అధికారులు మహేష్ పాల్గొన్నారు.

●**చిన్నశంకరంపేట:** మండల కేంద్రంలో తహసీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌గౌడ్, ఆర్ఐ గోవింద్ పాల్గొన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మాక్‌పోల్ నిర్వహణలో ప్రతిభను కనబర్చిన సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉత్తమ నిర్వహణ ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ రాజర్షిషా హెచ్ఎం సాయిరెడ్డికి అందజేశారు.



తూప్రాన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



కంగ్టిలో సీనియర్ ఓటర్లకు సన్మానం

ఎస్ఎంసీ ఎన్నికల నిలుపుదల

● పాత కమిటీలను రద్దు చేస్తూ విద్యాశాఖ నిర్ణయం

సంగారెడ్డి అర్బన్, జనవరి 25: సర్కారు బడుల్లో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికల నిర్వహణను నిలిపివేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు. ఎస్ఎంసీ ఎన్నికలు నాలుగేళ్లుగా నిర్వహించకుండా కమిటీ కాలాన్ని పొడిగిస్తూ వస్తున్నారు. తాజాగా ఈ నెల 18న ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఆ ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ, ప్రస్తుతమున్న కమిటీలను రద్దు చేస్తూ విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం మరో మూడు నెలలే ఉండడం, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో ఎన్నికలు నిర్వహించాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసింది. దీంతో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది.

శివానగర్‌కు భూమిని కేటాయించాలి

జిన్నారం, జనవరి 25: మండలంలోని శివానగర్ గ్రామంలో టీఎస్ఐపాస్‌కు కేటాయించిన స్థలంలో గ్రామ అవసరాల కోసం భూమిని కేటాయించి, పంచాయతీ పేరున రిజిస్ట్రేషన్ చేయాలని జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ రేఖ కృష్ణ, ఎంపీటీసీ సంతోషమహేష్, నాయకులు ఇంత్యాజ్ కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. శివానగర్ వద్ద టీఎస్ఐపాస్‌కు 130ఎకరాలను కేటాయించగా గ్రామ అవసరాలకు అందులో నుంచి 8 ఎకరాలను కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం మరో రెండు ఎకరాలను కేటాయించి, పంచాయతీకి అప్పగించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ భర్త

తూప్రాన్, జనవరి 25: తూప్రాన్ మండలం ఘనాపూర్ గ్రామానికి చెందిన ఎంపీపీ గడ్డి స్వప్న భర్త గడ్డి వెంకటేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

గ్రామసభల నిర్వహణ

నిజాంపేట, జనవరి 25: నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో గురువారం 2024-25 సంవత్సరానికి సంబంధించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై గురువారం సర్పంచ్ లద్ద ప్రీతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేష్, పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, ఉప సర్పంచ్ గెల్లు రాజం తదితరులు పాల్గొన్నారు.

●మనోహరాబాద్: కాళ్లకల్ గ్రామంలో గురువారం సర్పంచ్ నత్తి మల్లేష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యపై ఏఈ కృష్ణను గ్రామస్థులు నిలదీశారు. అనంతరం సమస్యలపై చర్చించారు. మనోహరాబాద్‌లో సర్పంచ్ మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు యాదవ్, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన

సంగారెడ్డి క్రైం, జనవరి 25: వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలని సంగారెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ రాములు సూచించారు. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గురువారం వాహనదారులకు గులాబీ పువ్వులు ఇస్తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి గమ్యస్థానం సురక్షితంగా చేరుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.

న్యాయవాదులకు క్రీడా పోటీలు

నారాయణఖేడ్, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నారాయణఖేడ్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ స్వరూప్ షెట్కార్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు క్రీడా పోటీలు నిర్వహించారు. న్యాయవాదులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మారుతి రెడ్డి, లక్ష్మణ్‌రావు, బోజిరెడ్డి, నర్సింహారావు, సాయిలు, భువనేశ్వరి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులను అణిచివేస్తున్న పోలీసులు

● ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాశ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 25: ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసులు వ్యవహరించిన తీరు విద్యార్థి నాయకులను అణిచివేసేలా ఉన్నదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాశ్ ధ్వజమెత్తారు. సంగారెడ్డిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఝాన్సీ పట్ల పోలీసుల తీరును ఖండిస్తున్నామని, అందుకు కారణమైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు దినేశ్, తానాజి, నిఖిల్, భానుప్రకాశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నారాయణఖేడ్: ఏబీవీపీ నాయకుల పట్ల పోలీసుల తీరును నిరసిస్తూ గురువారం నారాయణఖేడ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి అనిల్, నాయకులు రాజు, ముస్తఫ పాల్గొన్నారు.



ఖేడ్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కష్టపడే వారికే సంపదపై అధికారముండాలి: సీపీఎం

సంగారెడ్డి రూరల్, జనవరి 25: కష్టపడి సంపదను సృష్టించే రైతులు, కూలీలు, కార్మికులకే సంపదపై అధికారం ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో గురువారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. శ్రామికవర్గ విప్లవ నేత, 20వ శతాబ్దపు మార్క్సిస్టు, మేధావి, ప్రపంచంలోనే మొట్టమొదటి శ్రామిక వర్గ రాజ్యం సోవియట్ యూనియన్‌ను సాధించిన ఘనత లెనిన్ నాయకత్వానికి దక్కుతుందన్నారు. రైతులు, కూలీలు, ఉద్యోగులు, వృత్తిదారులకే రాజ్యాధికారం కావాలని పోరాడారని గుర్తు చేశారు. పెట్టుబడిదారుల దోపిడీకి విరుగుడు సోషలిజమేనని ఆయన ఆచరణలో రుజువు చేశారని చెప్పారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని లెనిన్ బలపరిచారని చెప్పారు. సామాజిక అణిచివేతలకు వ్యతిరేకంగా సాగుతున్న ఆనాటి ఉద్యమాలకు అయన ప్రత్యేకంగా గమనం చూపారని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, సాయిలు, నాయకులు ప్రవీణ్, నర్సింహులు, యాదవరెడ్డి, యాదగిరి, మహిపాలు, అశోక్, కృష్ణ, నాగేశ్వర్‌రావు, బాబురావు, రమేష్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న వీరయ్య

టీఎన్జీవో మెదక్ యూనిట్ ఎన్నిక

మెదక్ అర్బన్, జనవరి 25: టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో గురువారం మెదక్ పట్టణంలోని సంఘం భవనంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెదక్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. యూనిట్ అధ్యక్షుడిగా ఆరెళ్ల రామాగౌడ్, కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా నారాయణ, సహాధ్యక్షుడిగా శివరాం, ఉపాధ్యక్షులుగా సలీం పాషా, సత్యనారాయణ, తులసీరాం, తుకారం, శేఖర్, సుశీల ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఫజులొద్దిన్, యూనిట్ మాజీ అధ్యక్షుడు శివాజీ పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై కళా ప్రదర్శన

హత్నూర, జనవరి 25: హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో గురువారం హెచ్ఐవీ (ఎయిడ్స్) నిర్మూలనపై ప్రజలకు కళారూపాలతో అవగాహన కల్పించారు. స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శృతి కళాబృందం కళాకారులు పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమణారెడ్డి, స్కోప్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్ జ్యోతి, కళాకారులు శేఖర్‌చారి, భిక్షపతి, భూమయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల పరిశీలన

పుల్‌కల్, జనవరి 25: పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని గొంగ్లూరు, గంగోజిపేట, తాడ్దానిపల్లి, శివంపేట, చౌటకూర్ గ్రామాల్లో వరి నారుమడులను వ్యవసాయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు వై.చంద్రమోహన్, టి.కిరణ్, ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్‌విశ్వకర్మ, సరిత గురువారం వ్యవసాయ అధికారులతో పరిశీలించారు. నారుమడులు ఎర్రబారకుండా 2 గ్రాముల మ్యాంకోజెబ్, కార్బెండిజంను కిలో యూరియాలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కాండం తొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరేన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు పది కిలోలు వేయాలని రైతులకు సూచించారు. వారివెంట వ్యవసాయ అధికారి చైతన్య, ఏఈవో మనీష ఉన్నారు.

సమష్టి సహకారంతో గ్రామాల అభివృద్ధి



రుద్రారం పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, జనవరి 25: సమష్టి సహకారంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రుద్రారం గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనం, అంబేడ్కర్ యువజన సంఘం, బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రభుత్వం అందించే నిధులతో పాటు పరిశ్రమల సహకారంతో గ్రామ పంచాయతీ భవనాలతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీపీ సుష్మాశ్రీ, జడ్పీటీసీ సుప్రజ, ఎంపీటీసీలు మన్నె రాజు, హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో బన్సీలాల్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'మట్టిని తరలిస్తే కఠిన చర్యలు'

మనోహరాబాద్, జనవరి 25: అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మండలాధికారులు హెచ్చరించారు. మూడు రోజుల క్రితం మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో విద్యుత్ హైటెన్షన్ స్తంభం చుట్టూ మట్టిని తవ్వడంతో స్తంభం కూలే పరిస్థితి నెలకొంది. ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో మండలాధికారులు గురువారం సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. అక్రమంగా మట్టిని తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో యాదగిరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, ఆర్ఐ దీక్షిత్, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

వెల్దుర్తి/శివ్వంపేట, జనవరి 25: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని జడ్పీ చైర్‌పర్సన్ హేమలతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి సహకరంతో గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ స్వరూప, జడ్పీటీసీ రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, కుకునూర్ సర్పంచ్ ప్రీతి, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, పీఆర్‌డీఈ రాధిక, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు. శివ్వంపేట మండలంలోని మల్లుపల్లిలో పేదల కోసం జడ్పీటీసీ మహేష్‌గుప్తా సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటును ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహేష్‌గుప్తా, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, నాయకులు పిట్ల సత్యనారాయణ, కొంతాన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, గొర్ర వెంకట్‌రెడ్డి, యాదాగౌడ్, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, పవన్‌గుప్తా, శ్రీశైలం యాదవ్, కొండల్ పాల్గొన్నారు.



కుకునూర్ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సీసీ కెమెరాలతో శాంతిభద్రతల రక్షణ: డీఎస్పీ

పుల్‌కల్, జనవరి 25: పల్లెల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో శాంతిభద్రతల పరిరక్షణ సులభతరమవుతుందని సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని గంగోజిపేట గ్రామంలో ఫస్ట్ మీస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం జోగిపేట సీఐ నాగరాజుతో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ బుర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఫస్ట్ మీస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మొండెద్దుల నటరాజ్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, విద్యా కమిటీ చైర్మన్ కుమ్మరి అశోక్, పంచాయతీ కార్యదర్శి మంజుల, ఉప సర్పంచ్ గంగాధరి పుష్పలతనగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి హల్దీ వాగులో విగత జీవిగా లభ్యం



వెంకటయ్య మృతదేహం

తూప్రాన్, జనవరి 25: అదృశ్యమైన వ్యక్తి హల్దీ వాగులో విగత జీవిగా కనిపించాడు. తూప్రాన్ మండలం కిష్టాపూర్‌కు చెందిన పిట్ల వెంకటయ్య(52) మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి, తిరిగి రాలేదు. కొడుకు ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం హల్దీ వాగు ఒడ్డున వెంకటయ్య బట్టలు లభించడంతో వాగులో గాలింపు చేపట్టగా మృతదేహం లభించలేదు. గురువారం ఉదయం హల్దీవాగులో వెంకటయ్య మృతదేహం తేలడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చేపలు పట్టేందుకు వెళ్లి వాగులో మునిగి మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు.

చాప్టా.కె సర్పంచుపై సస్పెన్షన్ వేటు

నారాయణఖేడ్, జనవరి 25: చాప్టా.కె సర్పంచును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చాప్టా.కె సర్పంచ్ పార్‌శెట్టి సంగమ్మ కుమారుడు విజయ్‌కుమార్ ఇటీవల గ్రామ పంచాయతీకి చెందిన ఎస్‌బీఎం నిధులు రూ.6,07,500లక్షలను ఫోర్జరీ సంతకాలతో డ్రా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. దీంతో విజయ్‌కుమార్‌పై నారాయణఖేడ్‌పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ జరుపగా ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేసినట్లు తేలింది. దీంతో సర్పంచును ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ, ఇన్‌చార్జి సర్పంచుగా ప్రస్తుత ఉప సర్పంచు గంగయ్యస్వామిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామపంచాయతీ చెక్ పవర్‌ను ఎంపీడీవో జాయింట్ సిగ్నేచర్‌తో కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు.

తోటి కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

సంగారెడ్డి క్రైం, జనవరి 25: రేగోడ్ మండలం ఖాదిరాబాద్‌కు చెందిన కానిస్టేబుల్ పుట్ల లక్ష్మణ్ కుమార్ గత నెల 6న బైక్ అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. మృతుడికి భార్య రమలీల, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మణ్ కుటుంబానికి సహాయంగా తోటి కానిస్టేబుళ్లు అందరూ కలిసి రూ.2,01,400 నగదు జమ చేశారు. ఈ నగదును జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ చేతుల మీదుగా గురువారం రమలీలకు అందజేశారు. కానిస్టేబుల్ కుటుంబానికి చేయూతగా నిలిచిన 2012బ్యాచ్ కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.